క్లుప్తంగా

సూర్యగిరి ఎల్లమ్మకు పూజలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీసూర్యగిరి ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకలంకరణ, పూజలు చేశారు. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని, నైవేద్యం సమర్పించారు. ఆలయం ప్రాగణంలో సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. నాగదేవతకు పుట్టలో పాలుపోసి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన
జలమయమైన లోతట్టు ప్రాంతాలు



నిత్య ఎన్‌క్లేవ్‌లో నిలిచిన వరదనీరు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దాదాపు గంటన్నర పాటు కురిసిన వర్షంతో శ్రీరాంకాలనీ నిత్య ఎన్‌క్లేవ్, పహాడీషరీఫ్, షాహిన్‌నగర్, ఎర్రకుంట, ఉస్మాన్‌నగర్ బస్తీలలో వరదనీరు చేరింది. మార్గాలు లేక ప్రధాన రహదారులపై నిలిచిన నీటితో రాకపోకలు సాగించేందుకు స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



రహదారి పనులు ప్రారంభించిన కార్పొరేటర్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆమె లక్ష్మీనగర్ కాలనీలో రూ. 12.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఐఎస్ సదన్ డివిజన్‌లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో పనులను స్థానికులు సైతం తరచూ పరిశీలిస్తుండాలని ఏమైనా అవకతవకలు చోటుచేసుకుంటే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ శిరీష, నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలకృష్ణ, సురేందర్, ప్రఫుల్ కుమార్, కృష్ణయ్య, మోహన్‌రావు, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

పనుల పూర్తికి ఎంపీకి వినతి

నాగోలు: నాగోలు ధోబీఘాట్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని రజక సంఘం నాయకులు మంగళవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు బొడ్డుపల్లి చుక్కయ్య, బి. కృష్ణ మాట్లాడుతూ.. నాగోలు ధోబీఘాట్‌లో అసంపూర్తిగా ఉన్న కాంపౌండ్ వాల్, కమ్యూనిటీ హాల్, ధోబీఖానాలు, బాత్రూమ్, హైమాస్ట్ లైట్స్, మంచినీటి కనెక్షన్ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరగా స్పందించిన ఎంపీ మాట్లాడుతూ.. నాగోలు ధోబీఘాట్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మధు, మహేందర్ పాల్గొన్నారు.

బూత్‌స్థాయి కమిటీల ఏర్పాటు అత్యవసరం

మన్సూరాబాద్: డివిజన్లలోని ప్రతిబూత్‌స్థాయిలో కమిటీల ఏర్పాటు అత్యవసరమని, శక్తి కేంద్రాలు పార్టీకి జీవనాడులని బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మన్సూరాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వనివల్లి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ఎల్‌బీనగర్ నియోజకవర్గ డివిజన్, మోర్చా, బూత్‌కమిటీలు, శక్తికేంద్రాల ఇన్‌చార్జిలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపుపై ప్రజల్లో చైతన్యం పెంపొందించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు.

శిథిలావస్థలో ఈటీపీ



ఈటీ ప్లాంట్‌లో శుద్ధి అవుతున్న మురుగు నీరు (ఫైల్)

- ఎనిమిదేళ్ల క్రితం మురుగు నీటి శుద్ధికి ఏర్పాటు
- నిర్వహణ లోపించడంతో నీరుగారిన లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

కడ్తాల్: మురుగు నీటి శుద్ధి కోసం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎఫిలియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఈటీపీ) శిథిలావస్థకు చేరింది. నాడు పాలశీతలీకరణ కేంద్రంలో నీటి వృథాను అరికట్టడంతో పాటు, పాల కేంద్రంలోని మురుగు నీటిని శుభ్రం చేసేందుకు ఈటీ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కానీ సంబంధిత అధికారులు ప్లాంట్ నిర్వహణను గాలికొదిలేయడంతో ప్రస్తుతం ఎందుకు పనికి రాకుండా పోతుంది. ఎనిమిదేళ్ల క్రితం పాల కేంద్రంలో మురుగు సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు వ్యర్థ



చెట్లకొమ్మల మధ్య ఈటీపీ

నీటిని శుద్ధి చేసి తిరిగి ఉపయోగించడానికి అత్యాధునిక టెక్నాలజీతో అప్పట్లో ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సదుద్దేశంతో స్థాపించినా అనంతరం పర్యవేక్షణ లోపించి లక్ష్యం నీరుగారుతోంది.

రూ.23 లక్షలు ఖర్చు

మండల కేంద్రంలో పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేసి సుమారు 66 సంవత్సరాలు కావొస్తుంది. అత్యధిక పాల ఉత్పత్తిలో సమైక్య రాష్ట్రంలోనే ఎంతో పేరు గడించింది. మండలంతో పాటు, సమీప మండలాల్లోని 100కు పైగా సొసైటీల నుంచి నిత్యం పాల సేకరణ చేస్తుంటారు. పాడిపరిశ్రమాభివృద్ధి పథకం రాష్ట్రీయ కర్షక్ వికాస్ యోజన కింద రూ.23 లక్షలతో 2017లో ఈటీపీ ఏర్పాటు చేశారు. కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రంలో నిత్యం 5 వేల నుంచి 10 లీటర్ల వరకు వృథాగా పోతున్న నీటిని ఈ యంత్రంతో శుద్ధి చేశారు. నాలుగైదు ఏళ్ల పాటు ప్లాంట్ బాగానే నడిచింది. క్రమేపి నిర్వహణ లోపించి ప్లాంట్ శిథిలావస్థకు చేరింది. చుట్టూ ఏపుగా పెరిగిన చెట్లు, పిచ్చి గడ్డి పొదలు అలుముకున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎఫిలియంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పాడి రైతులు, స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం



ఇటీవల బాధ్యతలు స్వీకరించాను. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతాను. త్వరలోనే మరమ్మతులు చేయించి ఈటీ ప్లాంట్‌ను ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తా.

– ప్రాణేశ్‌కుమార్, మేనేజర్, పాలశీతలీకరణ కేంద్రం

స్పేస్ సెంటర్‌పై అవగాహన



అవగాహన సమావేశంలో విద్యార్థులతో శాస్త్రవేత్తలు

బడంగ్‌పేట్: భారత అంతరిక్షం గురించి సైంటిస్టులు మంగళవారం అవగాహన కల్పించారు. బడంగ్‌పేటలోని మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఇస్రో శాస్త్రవేత్తలు డా.ఆర్ శ్రీనివాస్, నాగ ప్రణీత్ హాజరై సెమినార్ నిర్వహించారు. స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సైంటిఫిక్ మోడల్‌ను విద్యార్థులు ప్రాజెక్టు నమూనాలు నిర్వహించగా శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతరిక్షంలో తెలియని ఎన్నో విషయాలను మిసైల్ నుంచి తెలుసుకుంటున్నామన్నారు. సైన్స్‌లో దాగి ఉన్న లోతైన విషయాలని విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తులో సైంటిస్టులుగా ఎదగడానికి అంతరిక్ష పరిశోధనల వివరాలు ఎంతో ఉపయుక్తం అవుతాయని తెలిపారు. స్పేస్ సైన్స్ టెక్నాలజీ ప్రాజెక్టులు తిలకించడానికి పలు పాఠశాలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు రావడం విశేషం. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తార పట్టాతిల్, డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్



రోడ్డును పరిశీలిస్తున్న శ్రీరాములుయాదవ్, నాయకులు

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ నాయకులతో కలిసి రావిర్యాల ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డును పరిశీలించి, భక్తులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత నెలరోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఆలయానికి వెళ్లే రోడ్డు పూర్తిగా నీట మునిగిందన్నారు. దీంతో భక్తులు అమ్మవారి దర్శనం కోసం కిలో మీటర్ దూరం నీటిలో నుంచి నడిచిపోవాల్సి వస్తోందన్నారు. భక్తులు ఇబ్బందులు పడుతున్నా దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోవడం లేదన్నారు. దేవాదాయ అధికారులకు ఆలయానికి వచ్చే ఆదాయం మీద ఉన్న శ్రద్ధ భక్తుల ఇబ్బందులు మీదా లేదా అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రస్తుత నియోజకవర్గ ఎమ్మెల్యే సబితారెడ్డి ఔటర్ రింగు రోడ్డు నుంచి ఆలయం వరకు 100 ఫీట్ల రోడ్డు నిర్మిస్తామని హామీఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని గుర్తుచేశారు. రావిర్యాల చెరువును రియాల్టర్ కబ్జా చేసి వెంచర్లు చేసిన హైడ్రా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు కాంటేకర్ మధుమోహన్, బరిగెల హేమలతరాజుగౌడ్, పార్టీ మాజీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్లు శివకుమార్, యాదగిరిరెడ్డి, విలాస్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు చార్జీల పెంపు క్షమించరాని నేరం

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం బస్సు చార్జీలను పెంచి పేద సామాన్య మధ్యతరగతి ప్రజలను మోసం చేసిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సు చార్జీల పెంపును నిరసిస్తూ మంగళవారం ఆయన ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్‌తో గాంధీభవన్ నుంచి అసెంబ్లీ వరకు బస్సులో ప్రయాణించి ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. బస్సు చార్జీలు పెంపు క్షమించరాని నేరమన్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి ఆ లోటును పూడ్చేందుకు చార్జీల పెంపుతో ప్రజల నడ్డి విరిస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీ ప్రయాణికులపై ఏకంగా ఒకేసారి రూ.10 పెంచి పేద మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టారని అన్నారు. ఇప్పటికే విద్యార్థుల బస్ పాస్‌లు, టీ–24 టికెట్ల ధరలు పెంచారని పేదలపై రేవంత్‌రెడ్డి సర్కార్‌కు కనికరం లేకుండాపోయిందని అన్నారు.ధరలు పెంచడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసమర్థతకు నిదర్శనమన్నారు.

పరామర్శ

ఎల్‌బీనగర్: అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతి చెందిన బీఎన్‌రెడ్డి నివాసి పోలే చంద్రశేఖర్ మృతదేహాన్ని ఆదివారం వరకు నగరానికి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన పోలే చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అమెరికాలో ఉంటున్న తెలుగు సంఘం ప్రజలతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామన్నారు.

అభినందన



జయకృష్ణను శాలువాతో సన్మానిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం: గ్రూప్–1 ఫలితాల్లో విజయాన్ని సాధించి అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా నియమితులైన మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామానికి చెందిన గడ్డమీది జయకృష్ణ మంగళవారం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జయకృష్ణను ఆమె అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్(ఏటీఓ)గా ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేద కుటుంబంలో చదివి ఉన్నతమైన ఉద్యోగం పొందడం గర్వకారణమన్నారు. ప్రజల పట్ల నిబద్ధతతో పనిచేస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి జయకృష్ణను ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో తుమ్మలూరు ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థి కటికల యాదగిరి పాల్గొన్నారు.

26న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

ఎల్‌బీనగర్: రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అర్హత కలిగిన బ్రాహ్మణ యువతీ యువకులకు వివాహ పరిచయ వేదిక ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు పోచంపల్లి శ్రీధర్‌రావు, కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణలు తెలిపారు. దరఖాస్తులు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని గాయత్రీభవన్‌లో అందుబాటులో ఉంటాయని ఈ నెల 16వ తేదీలోపు దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను వివాహ పరిచయ వేదిక రోజున అందిస్తామన్నారు. వనస్థలిపురంలోని రామాలయంలో నిర్వహిస్తున్నామన్నారు.

ప్రజాస్వామ్యానికి దొంగ ఓట్లు గొడ్డలిపెట్టు



అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, నాయకులు

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

కందుకూరు: ప్రజాస్వామ్యానికి దొంగ ఓట్లు గొడ్డలిపెట్టులాంటివని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆకులమైలారంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓట్ల చోరీపై సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని అంబేడ్కర్, బాబుజగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి హేయమైన చర్యగా అభివర్ణించారు. రాజ్యాంగం, రిజర్వేషన్లపై బీజేపీ దాడి చేస్తోందన్నారు. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న కొన్ని వర్గాల ఓట్లను బీజేపీ, ఈసీ తొలగిస్తూ కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కులం, మతం ఆధారంగా ఓట్లను తొలగిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో జల్‌పల్లి మున్సిపాలిటీలో వేలాది దొంగ ఓట్లను నమోదు చేశారని ఆరోపించారు. అర్హుల ఓట్లు తొలగించినా, బయటి వ్యక్తుల ఓట్లు నమోదు చేసినా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని అంతం చేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. ప్రతీ బూత్‌స్థాయిలో వంద సంతకాలు పెట్టించి ఈసీకి నిరసన తెలపాలన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎస్. వెంకట్రామ్‌రెడ్డి, మాజీ చైర్మన్ సరికొండ మల్లేశ్, డైరెక్టర్లు సురేందర్, ప్రశాంత్, యుగంధర్, సీనియర్ నాయకులు రాజాప్రతాప్‌రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, చిర్ర సాయిలు, డి.శ్రీధర్, వెంకటేశ్‌గౌడ్, సురేష్, భూపాల్‌రెడ్డి, రాకేశ్‌గౌడ్, ఎస్.పాండు, మదన్‌పాల్‌రెడ్డి, జి.నర్సింహ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరిస్తా

ఏఐసీసీ కో–ఆర్డినేటర్ రాఘవేందర్‌రెడ్డి



న్యూతిరుమలనగర్‌లో పర్యటిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: న్యూ తిరుమలనగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏఐసీసీ కో–ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కాలనీలో పర్యటించారు. రోడ్లు, డ్రైనేజీలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు రాఘవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయించి, అర్ధంతరంగా నిలిచిన పనులను పూర్తి చేయిస్తామన్నారు. సమస్యలను మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని కాలనీవాసులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు యాదయ్య, శివాజీ, శివరాంరెడ్డి, ఈదయ్య, నారాయణ, ఇస్మాయిల్, మధు, రవి, ప్రభాకర్‌రావు తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలని వినతి



కమిషనర్ సరస్వతికి వినతిపత్రం ఇస్తున్న కుర్మల్‌గూడ వాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో దేవాలయ స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ.. గ్రామస్తులు మంగళవారం కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుర్మల్‌గూడలోని సర్వేనంబర్లు 56, 57లో ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి చాలా ఏళ్ల క్రితం స్థలాన్ని కేటాయించారని, ప్రస్తుతం అట్టి స్థలంలో కొందరు వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను నిలిపివేయించి, స్థలాన్ని కాపాడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొద్రమోని రోహిణి రమేశ్, మాజీ ఉపసర్పంచ్ చిన మల్లారెడ్డి, అశోక్, నరహరి, భాస్కర్, భీమ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అన్ని స్థానాల్లో పోటీ చేయాలి

సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రాజ్



మాట్లాడుతున్న కార్యదర్శి బాల్‌రాజ్

కందుకూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున అన్ని స్థానాల్లో పోటీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ అన్నారు. మండల పరిధిలోని గూడూరులో పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి గౌర శ్రీశైలం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వార్డుసభ్యుల నుంచి మొదలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో అభ్యర్థులను పోటీకి నిలపాలన్నారు. ప్రజల కోసం నిత్యం పనిచేసే పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేలా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంజయ్య, బండి సత్తయ్య, శ్రీను, జంగయ్య, రాములు, అంజయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



బడంగ్‌పేట్: వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ సరస్వతి, అధికారులు

బడంగ్‌పేట్: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహర్షి వాల్మీకి ఆదికవి. ఆయన రచించిన రామాయణం నిత్య నూతన గ్రంథం. ఆయన చూపిన సత్యం, ధర్మం, న్యాయ మార్గం ప్రతి మనిషి జీవనానికి మార్గదర్శకమని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ జాన్ కృపాకర్, మేనేజర్‌లు శ్రీధర్‌రెడ్డి, స్వప్న, ఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగమణి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎస్.నాగేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడిపల్లిలో..

పహాడీషరీఫ్: రామాయణ ఇతిహాసాన్ని రచించిన వాల్మీకి మహర్షి జీవితాన్ని ప్రతి ఒక్క హిందువు ఆదర్శంగా తీసుకోవాలని మామిడిపల్లి వాల్మీకి సంఘం నాయకుడు ఎల్.కె.కృష్ణ అన్నారు. అశ్వయుజ పూర్ణిమ రోజున వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గ్రామంలో వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి జయంతికి ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుక్క చంద్రశేఖర్, లొద్దిల యాదగిరి, కోట్ల బాబు, కోట్ల రంగనాథ్, గుజ్జుల పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలో పాల్గొన్న నాయకులు



మీర్‌పేట: నివాళులర్పిస్తున్న కమిషనర్ నాగమణి, అధికారులు